మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
సోమవారం , 07, సెప్టెంబర్, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

### మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రేవంత్ రెడ్డి

# అత్యవసర సమావేశం



- స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు
- వీడియో ఫుటేజ్‌లను పరిశీలించిన రేవంత్ రెడ్డి
- తాతా మధును బర్తరఫ్ చేయాలన్న కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు

**హైదరాబాద్ :**అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం, ఇదే సమయంలో స్పీకర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల దరిమిలా తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పరిణామాలపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, కీలక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అత్యవసరంగా భేటీ అయ్యారు. ఆందోళనల సమయంలో స్పీకర్‌ను, పోలీసు యంత్రాంగాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడిన వీడియో ఫుటేజ్‌లను సీఎం స్వయంగా పరిశీలించి, అధికారులను ఆరా తీశారు. శాసనసభ స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేత పట్ల అహంకారపూరితంగా వ్యవహరిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు ఇందుకు బాధ్యులైన బీఆర్ఎస్ సభ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. సీఎంతో భేటీ అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన దళిత ఎమ్మెల్యేలు... బీఆర్ఎస్‌కు దళితులంటే ఆదినుంచీ చిన్నచూపేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళిత స్పీకర్‌ను అవమానించిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని... సభ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తాతా మధు చేసిన వ్యాఖ్యల వీడియోను సీఎం కార్యాలయం విడుదల చేసింది.

# ‘నా చీర లాగేశారు’



- అసెంబ్లీ గేటు వద్ద సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు

**హైదరాబాద్ :**తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తన చీర లాగేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తన కాలికి కూడా గాయమైందని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు.బీఆర్ఎస్ నేతలు నల్ల షర్టులు, మహిళా నేతలు నల్ల చీరలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. అయితే వారికి ప్రవేశం లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.తన చీర లాగడం బాధ కలిగించిందని సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్న మహిళలకే రక్షణ లేకపోతే బయట ఉన్న మహిళలకు వీళ్లు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. తన కాలికి గాయమైందని తెలిపారు.తాము అసెంబ్లీకి వస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్న భయంతోనే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

### వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు

# పూర్తి చేస్తాం

- ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని స్పష్టీకరణ
- నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకున్నామని వెల్లడి



**హైదరాబాద్ :**వచ్చే బోనాల పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు నియోజకవర్గాన్ని యూనిట్?గా తీసుకున్నట్లుగా వివరించారు. లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే సిమెంట్ ఇప్పిస్తామని చెప్పారు. పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని పొంగులేటి వెల్లడించారు. 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా కొంతమందికి పట్టాలిచ్చిందన్నారు. వారు ఇచ్చిన ఇళ్లలో చాలా మంది నివసించట్లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేదలు నివసించే ప్రాంతానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఇచ్చారని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసించే వారిని అంటరాని వారిగా చూసేవారని ఆయన తెలిపారు.

### టీషర్ట్ విప్పేసిన హరీశ్‌రావు, కంటతడి పెట్టిన సునీత

# అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత

- అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదం
- పోలీసుల అభ్యంతరంతో టీ షర్టులు విప్పేసిన హరీశ్‌రావు, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్ :**తెలంగాణ అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో రావొద్దని బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల అభ్యంతరంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీ షర్టులు విప్పేశారు. బలియన్లపై ఉన్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కేటీఆర్, హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీసుల తీరుపై సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు తన పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వైఖరిని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు.

### స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

# అనుచిత వ్యాఖ్యలు

- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్



**హైదరాబాద్ :**శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న దళిత నేతను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా అవమానించా రంటూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబ ద్ధమైన స్థానానికి కనీస గౌరవం ఇవ్వకుండా ‘ఎవడ్రా’, ‘స్పీకర్ గాడు’ అంటూ ఏకవచనంతో సంబోధించడమే కాకుండా, ‘అధికారం ఇచ్చిన వాడు ఎవడ్రా’ అంటూ తీవ్ర అసభ్య పదజాలంతో బూతులు తిట్టడం బీఆర్ఎస్ నేతల అహంకారానికి, దళిత వ్యతిరేక మనస్తత్వానికి అద్దం పడుతోందని మండిపడ్డారు.ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు అత్యంత తీవ్రంగా పరిగణించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అసభ్యకర పదజాలంతో దూషించిన తాతా మధును తక్షణమే ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఎంను కోరారు.శాఖ మంత్రి సీతక్క కూడా తీవ్రంగా స్పందించారు.

## తెలంగాణలో రాజకీయ వేడి

### హౌస్ అరెస్టులపై బీజేపీ ఆగ్రహం



**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అసెంబ్లీ ముట్టడికి బీజేపీ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమై పలువురు కీలక నేతలను గృహనిర్బంధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల అరెస్టులతో ఉద్రిక్త పరిస్థితులునెలకొన్నాయి. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 22ఏ జాబితా నుంచి ప్రైవేటు భూములను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఈ ఆందోళనకు పిలుపునిచ్చింది. ‘ఫీజు బకాయి-బీజేపీ లడాయి’లో భాగంగా ‘చలో ఇందిరాపార్క్’ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. అయితే, ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతినిరాకరించారు.అనుమతి లేనప్పటికీ అసెంబ్లీ ముట్టడికి బీజేపీ శ్రేణులు సిద్ధమవడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

### ఎల్పీ మీటింగ్ కూడా కేసీఆర్


# ఫాంహౌస్‌లోనే చేస్తారా?



**హైదరాబాద్, సెప్టెంబర్ 7:**
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు (సోమవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేత బయటకు రారని.. ఎల్పీ మీటింగ్ కూడా ఫాంహౌ స్‌లోనే చేస్తారా అంటూ ప్రశ్నించారు. రాజకీయ రాద్ధాంతం తప్ప బీజేపీ, బీఆర్ఎస్‌లకు సమస్యలు పట్టవా అని నిలదీశారు. చట్టాలు చేసే పవిత్ర దేవాలయం అసెంబ్లీ అని.. సమావేశాలకు రాకుం డా బయట నిరసన ఎందుకని బీఆర్ఎస్‌పై మండి పడ్డారు. సభ ప్రారంభం కాగానే బీజేపీ నిరసన దేనికంటూ ఫైర్ అయ్యారు. చర్చిస్తామంటే నిరసన వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షం తెలంగాణలో లేదన్నారు. ప్రతిపక్షాలకు ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉందా అంటూ దుయ్యబట్టారు.బీజేపీ, బీఆర్ఎస్‌లు డ్రామా కంపెనీలుగా మారాయని మంత్రి విమర్శించారు. ఒకరు అసెంబ్లీ బయట, మరొకరు అసెంబ్లీ లోపల డ్రామా చేస్తున్నారని అన్నారు. వారికి కేవలం రచ్చ, రాజకీయం, ప్రచారం కావాలన్నారు.

# రాజకీయ నాయకులు వర్తమానాన్ని అర్థం చేసుకోవాలి

**అమరావతి:** ఇప్పుడు ఎన్నికలు జరిగినా కూటమిదే విజయమని సీఎం చంద్రబాబు అన్నారు. సర్వేలన్నీ కూటమికే అనుకూలంగా ఉన్నాయని టీడీపీ నేతల్లో ఆయన జోష్ నింపారు. అమరావతిలో జరుగుతోన్న తెలుగుదేశం పార్టీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నాయకులు, పార్టీ ప్రజా ప్రతినిధులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమిలో ఐకమత్యం కీలకమని పేర్కొన్నారు. గిల్లికజ్జాలతో రచ్చకెక్కొద్దంటూ నేతలకు హితబోధ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌కు ఆయన హాజరయ్యారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.



ఆ తర్వాత శిక్షణ తరగతులకు హాజరైన ఎమ్మెల్యేలకు రాజకీయాలపై పలు సూచనలు చేశారు.

పరిష్కారం అయ్యేవరకూ ప్రయత్నించాలి: రాజకీయ నాయకులు వర్తమానాన్ని అర్థం చేసుకోవాలని చంద్రబాబు కోరారు. అనేక అవకాశాలు మన వద్ద ఉన్నాయని, వాటిని నాయకులు అందిపుచ్చుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నివేదిక తయారు చేస్తామని, అనేక రకాల పెట్టుబడులు విశాఖ రీజియన్‌కు తీసుకు వస్తున్నామన్నారు. నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, దీనిపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. ప్రజల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు.

# గురువుల సేవలు సమాజానికి మార్గదర్శకం

- మండల విద్యాధికారి టీ. మనోహర్
- షాద్‌నగర్‌లో ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవం
- తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం




**షాద్ నగర్ ప్రజావాణి సెప్టెంబర్ 06 :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవాన్ని ఆదివారం షాద్‌నగర్‌లోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దాదాపు 50 పాఠశాలలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు,



ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుంచి బాలవిహార్, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విభాగాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి పురస్కారాలు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి టీ. మనోహర్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. మంచి గురువు విద్యార్థికి కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా క్రమశిక్షణ, విలువలు, బాధ్యత, మంచి వ్యక్తిత్వాన్ని అందిస్తారని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎప్పటికీ ప్రత్యేకమైనవని తెలిపారు.సీనియ ర్ విద్యావేత్త రాజేందర్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో సామాజిక మాధ్యమాల ప్రభావం విద్యార్థులపై పెరుగుతున్న నేపథ్యంలో వారికి సరైన దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై మరింత పెరిగిందన్నారు. అంతర్జాల తరగతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు అందుబాటులోకి వచ్చినప్పటికీ విద్యార్థి మనస్తత్వాన్ని అర్థం చేసుకుని, అతని సామర్థ్యాలను గుర్తించి వ్యక్తిగతంగా ప్రోత్సహించే గురువు స్థానాన్ని ఏ సాంకేతికతా భర్తీ చేయలేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం విద్యకు సహాయక సాధనం మాత్రమేనని, గురువు మాత్రం విద్యార్థి జీవితానికి మార్గదర్శి అని పేర్కొన్నారు.తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శారదా ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీఎన్ స్వామి మాట్లాడుతూ, విద్యార్థి భవిష్యత్తుకు పునాది వేసే వ్యక్తి గురువు అని అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వారి కృషిని గుర్తించి సన్మానించడం ద్వారా మరింత ఉత్సాహంతో పనిచేసేలా ప్రోత్స హించవచ్చని తెలిపారు.సంఘం పట్టణ అధ్యక్షుడు కే. వంశీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆనంద్, రిజ్వాన్, స్వాతి రెడ్డి, రఫీస్ సుల్తానా, రాజన్, యూనెస్, మధుసూదన్, థామస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, కవిత, అంజద్, వీరేష్, జయభార్గవి, అనురాధ, రాజు, కల్పన రెడ్డి, రమణారెడ్డి, నవీన్ కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. 40కి పైగా పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకు లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.“గురువు మారితే విద్యార్థి మారుతాడు.. విద్యార్థి మారితే సమాజం మారుతుంది” అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది..

# పగిలిన మిషన్ భగీరధ పైపు లైన్.... మర్మత్తులు చేసిన సిబ్బంది



**మద్దూరు సెప్టెంబర్ 7, ప్రజావాణీ,** మద్దూరు మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపు లైన్ పగిలి ఆయా గ్రామాలకు సరఫరా అవుతున్న త్రాగు నీరు కలుషితం అవుతున్నాయని గ్రామ ప్రజలు తీవ్రంగా మండి పడడంతో స్పందించిన మిషన్ భగీరథ అధికారులు సోమవారం పగిలిన పైపు లైన్ మరమత్తులు చేపట్టారు. దీంతో మద్దూరు,ఆయా గ్రామాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. త్రాగు నీరు కలుషిత విషయాన్ని తెలుసుకొని మరమ్మత్తు పనులు చేపట్టిన మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ సిబ్బందిని మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# అసెంబ్లీ ముందు టీ షర్టు విప్పిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- పోలీసులకు బిఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వివాదం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?
- నల్ల టీషర్టు విప్పి నిరసనకు దిగిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..

**షాద్ నగర్ ప్రజావాణి సెప్టెంబర్ 07:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి.. 1000 రోజులు గడిచినా హామీల అమలుపై సమాధానం చెప్పకుండా ప్రశ్నించే గొంతులను అణచివేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి బయలుదేరిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడంపై ఆయన మండిపడ్డారు.తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి నిరసనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తూ అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.అసెంబ్లీలోకి నల్ల టీషర్టుతో వెళ్లేందుకు అనుమతి



లేదని పోలీసులు చెప్పడంతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన టీషర్టును విప్పేశారు. అయినప్పటికీ పోలీసులు ఆయనను అర్ధనగ్నంగా కూడా అసెంబ్లీలోకి అనుమతించలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అనంతరం పోలీసులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో తరలించారు.ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఏ మేరకు సమంజసమని నవీన్ రెడ్డి ప్రశ్నించారు. “100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. 1000 రోజులు గడిచినా ప్రజలకు సమాధానం చెప్పరా? ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తారా?” అంటూ ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే నల్ల టీషర్టులతో నిరసన చేపట్టామని, తమ నిరసనను అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన అసహనాన్ని బయటపెట్టుకుందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తారా? అని ప్రశ్నిస్తూ.. నవీన్ రెడ్డి అరెస్టును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి..

# అక్రమ నిర్బంధాలు,అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు..

**- బి జె వై ఎం నాయకులు సోగాల మనోజ్ కుమార్**




**మద్దూరు సెప్టెంబర్ 7, ప్రజావాణీ,** 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఇచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి వెళ్తున్న బి జె వై ఎం నాయకులు సోగాల మనోజ్ కుమార్ ను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందనీ. మనోజ్ కుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా 40 లక్షల మంది తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థుల హక్కుల సాధనకై ధర్నా చౌక్ లో ‘విద్యార్థి మహాధర్నా’కు పిలుపునిస్తే.. భయంతో వణికిపోయి అనుమతి నిరాకరించిన ఈపిరికి, నియంత కాంగ్రెస్ సర్కారుకు విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తాం ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. విద్యార్థుల పక్షాన బిజెపి పోరాటం ఆగదనీ స్పష్టం చేశారు.ఈ అహంకార ప్రభుత్వ మెడలు వంచేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదు అన్నారు..విద్యార్థుల భవిష్యత్తుపై మీ ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, వారి గొంతు వినడానికి ఎందుకు భయపడుతున్నారని నిరసనను అణచివేయడం కాదు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలకు పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు.

# కాశీ దర్శనం ట్రావెల్ తెలుగు అనువాదం కూకట్పల్లి ఉంగరాల చైతన్య కుమార్

**కాశీ విశ్వనాథ్ మరియు కాలభైరవ దర్శనం**






**కూకట్పల్లి విలేజ్ (ప్రజావాణి) సెప్టెంబర్ 7 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.** ఎయిర్‌పోర్ట్ లేదా వారణాసి జంక్షన్‌లో రాక. ప్రైవేట్ క్యాబ్ ద్వారా పికప్ చేసుకుని హోటల్‌లో దింపుతారు.సందర్శన మరియు దర్శనం ప్రారంభం శ్రీ కాల భైరవ దర్శన శ్రీ కాశీ విశ్వనాథ్ జీ దర్శనం కాశీ విశ్వనాథ్ కారిడార్ సందర్శన మా అన్నపూర్ణ జీ దర్శనం మా విశాలాక్షి శక్తిపీఠ దర్శనంప్రపంచ ప్రసిద్ధ గంగా హారతి వీక్షణ స్థానిక స్ట్రీట్ ఫుడ్ చాట్, గోల్‌గప్పాపూర్తి వారణాసి సందర్శన మరియు సాయంత్రం బోట్ రైడ్ అల్పాహారం (బ్రేక్ ఫాస్ట్) తిల్ భాండేశ్వర్ మహాదేవ్ ఆలయంగౌరీ కేదారేశ్వర్ ఆలయంచింతామణి గణేష్ ఆల యంఆది శక్తి దుర్గా మా ఆలయం సంకట్ మోచన్ ఆలయం భోజనం కోసం విశ్రాంత బింది పరకోట ఘాట్ సందర్శన ఫోటో షూట్ మరియు బోట్ రైడ్ కోసం బిందు మాధవ్ ఆలయం తెలంగాణ స్వామి మఠం చంద్ర కూప్ మరియు శ్రీ సిద్ధి దాత్రి మాత ఆలయం.ప్రైవేట్ క్యాబ్ ద్వారా వారణాసి సందర్శన ప్రారంభం అల్పాహారం, స్వర్వేద మహామందిర్ సారనాథ్ సందర్శన మ్యూజియం బుద్ధ టెంపుల్ మొదలైనవి రామ్‌నగర్ ఫోర్ట్ దీంఖ మరియు న్యూ కాశీ విశ్వనాథ్ ఆలయం సాయంత్రం మార్కెట్ సందర్శన షాపింగ్ కోసం లేదా మీ ఇష్టం.తెలుగు అనువాదం మృత్యుంజయ మహాదేవ్ ఆలయం దండపాణి భైరవ పితా మహేశ్వర్ మహాదేవ్ ఆలయం భూమి ఉపరితలం నుండి 40 అడుగుల లోతులోమణికర్ణికేశ్వర్ మహాదేవ్‌సంకతా మాత ఆల యం కాశీ విశ్వనాథ్ శయన హారతి రాత్రి 10:15గావీ (ఆప్షనల్).

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- ప్రజావాణిలో ఎంపీడీవోకు బీఆర్ఎస్ వినతి**




**బెజ్జంకి, సెప్టెంబర్ 7 (ప్రజావాణి)** బెజ్జంకి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని అలాగే మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతు భరోసా, రైతు కూలీలకు ఏటా రూ.12 వేల సాయం, పంటలకు బోనస్, నిరుద్యోగ భృతి, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ల పెంపు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను అమలు చేయాలని కోరారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కురవి లో ప్రభుత్వ భూములకు రక్షణ ఏదీ?

**ప్రభుత్వ భూములకు రక్షణ**

**భూ కబ్జాలకు అడ్డుకట్ట**

**177పై సమగ్ర సర్వే**

**హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి**

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**కలెక్టర్ చొరవ చూపాలి.**

**డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి , సెప్టెంబర్ 7 ప్రజావాణి:** కురవి మండల కేంద్రం లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించి రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ డోర్నకల్ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**భూ కబ్జాలకు అడ్డుకట్ట**

కురవి మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో వీరబాబుకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ




సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విలువైన ప్రభుత్వ భూములను కొందరు బోగస్ పత్రాలతో ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమణలు పెరుగుతున్నాయని అన్నారు.

**177పై సర్వే చేయాలి**

177 సర్వే నంబర్‌తో పాటు కురవి గ్రామ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూములన్నింటినీ జిల్లా సర్వేయర్‌తో సమగ్రంగా సర్వే చేయించాలని కోరారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలు, హరిత హోటల్, మహిళల పెట్రోల్ బంక్‌లకు స్థలాలు కేటాయిస్తామని అధికారులు చెప్పిన నేపథ్యంలో ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా గుర్తించాలని అన్నారు.

**హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి**

ప్రభుత్వ భూములకు హద్దురాళ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్‌ను కోరారు. ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థలో ఉండగా, ఎస్సీ హాస్టల్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు బుడమ వెంకన్న, దూది కట్ల సారయ్య, కన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com